



భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న స్పీకర్ ప్రసాద్ కుమార్

చెంచుల అవసరాలకు మల్టీపర్పస్ సెంటర్ ఏర్పాటు

» స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

వికారాబాద్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): చెంచు కాలనీవాసుల అవసరాల నిమిత్తం బహుళార్థక సాధక కేంద్ర భవనం నిర్మాణం చేస్తున్నట్లు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తెలిపారు. శనివారం వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని అనంతగిరిపల్లి చెంచుకాలనీలో పీఎం జన్‌మన్ పథకం కింద కేంద్రం నిర్మించే మల్టీపర్పస్ సెంటర్ భవన నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ చెంచుకాలనీ వాసుల అవసరాల నిమిత్తం రూ.60 లక్షల వ్యయంతో ఈ భవనాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా గిరిజన అభివృద్ధి కమలాకర్ రెడ్డి, ఆర్డీవో వాసుచంద్ర, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, నాయకులు సుధాకర్ రెడ్డి, సత్యనారాయణ, మహిపాల్ రెడ్డి, కిషన్ నాయక్ చిగుల్లపల్లి రమేశ్, రెడ్యానాయక్, ముత్తహర్ షరీఫ్, హఫీజ్ తదితరులు పాల్గొన్నారు.



జుంటుపల్లి ప్రాజెక్టు

నీరు లేక చెరువులు వెలవెల

యాలాల, జూలై 12 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలం ప్రారంభమై 40 రోజులు దాటుతున్నా నీరు లేక చెరువులు, కుంటలు వెలవెలబోతున్నాయి. వర్షాకాలం ముందు దంచికొట్టిన వానలు ప్రస్తుతం జాడా లేకపోవడంతో ఆయకట్టు రైతులు కన్నీటిపర్యంతమవుతున్నారు. యాలాల మండలంలో జుంటుపల్లి ప్రాజెక్టుతో పాటు దాదాపు 70పైగా చెరువులు, కుంటలు ఉన్నాయి. చెరువులు, కుంటల కింద వేలాది మంది రైతులు వరిపంట సాగు చేసుకుంటారు. అయితే ఇప్పటి వరకు కురిసిన వర్షాలతో మెట్ట రైతులకు మాత్రమే మేలు చేకూరింది. సరైన వర్షాలు లేకపోవడంతో చెరువులు, కుంటలు, ప్రాజెక్టు కింద ఉన్న రైతుల పొలాలు బీడుగా మారాయి.

ఇసుక కొరత..
నత్తనడక!
ముందుకుసాగని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు

మంజూరైనా మార్కింగ్ దశలోనే పనులు

అమాంతం పెరిగిన ఇసుక ధరలు

పలుచోట్ల డస్ట్‌తో కొనసాగిస్తున్న నిర్మాణాలు

పనుల ఆలస్యంపై ఆందోళనలో లబ్ధిదారులు


వికారాబాద్‌కు 10,398, మేడ్చల్‌లో 1,554 ఇళ్లు మంజూరు



దొల్లాబాద్‌లో డస్ట్‌తో చేపడుతున్న ఇంటి నిర్మాణం

స్లాబ్ ఎలా వేయాలి

కింద ఉన్న చిత్రంలోని మహిళ పేరు పి. జయమ్మ. మర్పల్లి మండలం, గుండ్ల మర్పల్లి గ్రామం. ఈ గ్రామాన్ని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి అధికారులు పైలెట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేశారు. దీంతో ఇల్లు మంజూరు కాగానే ఆమె ఏప్రిల్ చివరివారంలో నిర్మాణ పనులు ప్రారంభించింది. నిర్మాణం ప్రస్తుతం లెంటల్ దశకు చేరుకుంది. పనులు ప్రారంభించిన సమయంలో ఇసుక ధర టన్నుకు రూ.1,500 ఉండగా, ప్రస్తుతం రూ.2,400లకు పెరిగింది. ఇంత వరకు గోడల నిర్మాణానికి తక్కువ ఇసుక వాడగా, స్లాబ్ వేయడానికి 20 టన్నులు అవసరం కానుంది. ఇసుక ధర బాగా పెరగడంతో కొరత ఏర్పడింది. ఈ పరిస్థితుల్లో స్లాబ్ ఎలా వేయాలని ఆమె ఆవేదన వ్యక్తం చేస్తోంది.



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు వికారాబాద్ జిల్లాలో నత్తనడకన సాగుతున్నాయి. మంజూరైన ఇళ్లల్లో సగం వాటికి మాత్రమే ముగ్గు పోశారు. అక్కడ కూడా ఇసుక దొరక్కపోవడం, దొరికినా ధర ఎక్కువగా ఉండటంతో నిర్మాణ పనులు ముందుకు సాగడం లేదు. జిల్లాకు 10,398 ఇళ్లు మంజూరు కాగా, ఇందులో 4,622 ఇళ్లకు మార్కు వుట్ ఇవ్వగా, 317 ఇళ్లు మాత్రమే పునాదుల స్థాయిలో ఉన్నాయి. 52 ఇళ్లు పైకప్పు దశలో కొనసాగుతుండగా, 19 ఇళ్ల పైకప్పు వరకు పూర్తయ్యాయి. కాగా, ఇప్పటి వరకు ఒక్క ఇల్లు కూడా పూర్తికాలేదు. అలాగే మేడ్చల్ జిల్లా వ్యాప్తంగా 1,554 ఇళ్లు మంజూరు కాగా, 700 ఇళ్లకు ముగ్గు పోశారు. ఇందులో 144 ఇళ్లు బేస్మెంట్ లెవల్‌కు, మరో 44 ఇళ్లు రూఫ్ స్థాయికి చేరుకున్నాయి.



ఘట్‌కేసర్ మున్సిపాలిటీ, ఘనాపూర్‌లో..

ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్, జూలై 12: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి అవసరమయ్యే ఇసుక కోసం అధికారులు అనుమతులు ఇస్తామని చెబుతున్నా స్థానికంగా ఇసుక దొరకడం లేదు. బయట నుంచి వచ్చే ఇసుక ధర మాత్రం ఆకాశన్నంటుతోంది. మూడు నెలల క్రితం సాధారణ రకం ఇసుక ధర టన్నుకు రూ.1,600, సన్నరకం రూ.2వేల వరకు ఉండేది. ప్రస్తుతం మార్కెట్లో

మిగతా 8వ పేజీలో...



సీసీఐలో నేటి నుంచి సిమెంట్ ఉత్పత్తి

తాండూరు రూరల్, జూలై 12, (ఆంధ్రజ్యోతి) : కరన్‌కోట్ శివారులోని ప్రభుత్వ రంగ సిమెంటు కర్మాగారం(సీసీఐ)లో ఆదివారం అర్ధరాత్రి నుంచి సిమెంటు ఉత్పత్తి ప్రారంభం కానుంది. కాగా, కర్మాగారం పది రోజుల నుంచి షెడ్‌డౌన్ అయిన విషయం తెలిసిందే. కర్మాగారం ప్రారంభంతో ప్రతీ రోజు సుమారు 2,000 మెట్రిక్ టన్నుల సిమెంటు ఉత్పత్తి అయ్యే అవకాశం ఉందని కార్మికులు పేర్కొంటున్నారు. ప్రధానంగా కర్మాగారంలోని కిలాన్ విభాగంలో వేడి ఎక్కువగా ఉండటం వల్ల సాంకేతిక లోపం తలెత్తుతుందని, దీన్ని సరిచేసేందుకు పది రోజులపాటు మరమ్మతులు చేయాల్సి ఉంటుంది.

'అనురాగ్'లో కూలిన సెంట్రింగ్

నలుగురు కార్మికులకు గాయాలు



ఘట్‌కేసర్ రూరల్, జూలై12(ఆంధ్రజ్యోతి): స్లాబ్ వేసే క్రమంలో ప్రమాదవశాత్తు సెంట్రింగ్ జాక్ రాడ్డు జారీ పైఅంతస్తు నుంచి కింది అంతస్తులో పడింది. ఈ ప్రమాదంలో నలుగురు కార్మికులకు గాయాలయ్యాయి. ఈ సంఘటన మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా పోచారం ఐటీ కారిడార్ పోలీసుస్టేషన్ పరిధిలోని అనురాగ్ యూనివర్సిటీలో శనివారం జరిగింది. ఉదయం ఓ భవన నిర్మాణం పదో అంతస్తుకు స్లాబ్ వేస్తుండగా ప్రమాదవశాత్తు సెంట్రింగ్ జాక్ రాడ్ కదలడం వల్ల పైఅంతస్తులో పని చేస్తున్న నలుగురు కార్మికులు తొమ్మిదో అంతస్తులో పడ్డారు. ఈ ప్రమాదంలో ఛత్తీస్‌గఢ్‌కు చెందిన రాజుయాదవ్ (34) ఓంప్రకాశ్(28), మహబూబ్‌నగర్‌కు చెందిన రాజు(20), కేశవ్(30)కు గాయాలయ్యాయి. దీంతో తోటి కార్మికులు హుటాహుటిన స్థానిక ఆస్పత్రికి తరలించి పోలీసులకు సమాచారం అందించారు. ఓంకార భవన నిర్మాణ సంస్థ కాంట్రాక్టర్ పోలీసులకు ఈ ప్రమాదంపై ఫిర్యాదు చేశారు.

పట్టా చేతికొచ్చిందోచ్..

సంబరంగా నల్సార్ స్నాతకోత్సవం



మేడ్చల్- మల్కాజ్‌గిరి జిల్లా శామీర్‌పేట లోని నల్సార్ యూనివర్సిటీలో 22వ స్నాతకోత్సవం సంబరంగా జరిగింది. శనివారం న్యాయ విశ్వవిద్యాలయంలోని ఆడిటోరియం హాల్‌లో హైకోర్టు జడ్జి సుజోయ్ పాల్ అధ్యక్షతన, యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ శ్రీకృష్ణదేవరావు ఆధ్వర్యంలో కాన్వొకేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఆనందోత్సాహాల మధ్య 462 మంది విద్యార్థులు పట్టాలనందుకున్నారు. కాగా, ఈ కార్యక్రమానికి సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

-శామీర్‌పేట, జూలై 12 (ఆంధ్రజ్యోతి)

మధ్యాహ్న భోజనంలో పురుగులు

» ఆందోళన చేసిన కస్తూర్బా విద్యార్థినులు



ఆందోళన వ్యక్తం చేస్తున్న విద్యార్థినులు

మర్పల్లి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మర్పల్లి మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ పాఠశాలలో మెనూ ప్రకారం భోజనం వడ్డించడం లేదని, అన్నంలో పురుగులు వస్తున్నాయని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం మధ్యాహ్న భోజనం చేస్తున్న సమయంలో అన్నంలో పురుగులు రావడంతో తోటి విద్యార్థులతో కలిసి వరండాలో గుమ్మిగూడి నిరసన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న స్థానిక విలేకరులు పాఠశాలకు వెళ్లగా విద్యార్థులు మాట్లాడుతూ ప్రిన్సిపాల్‌ను ఈ విషయమై అడిగితే తమపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందని వాపోయారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలను ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి విద్యార్థుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరారు.

ప్రభుత్వ భూముల్లో ఈత, తాటి, ఖర్జూర మొక్కలు నాటాలి

డ్రగ్స్‌ను ఉక్కుపాదంతో అణచివేయాలి.. ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి

వికారాబాద్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): చెరువు కట్టల మీద, గుట్టపైన కాలువల పక్కన ఈత, తాటి ఖర్జూరా చెట్లను పెంచేలా ప్రోత్సహించాని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సూచించారు. ప్రతీ గ్రామంలో 5 ఎకరాల్లో ఈ చెట్లను నాటేలా చర్యలు తీసుకోవాలన్నారు. శనివారం వికారాబాద్ పట్టణంలోని శివారెడ్డిపేట సమీపంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్‌ను స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, చీఫ్‌విప్ పట్నం మహేందర్ రెడ్డి, ఎంపీ విశ్వేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్యే కాలే యాదయ్యతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ డ్రగ్స్ సంస్కృతిని ఉక్కుపాదంతో అణచివేయాలని అధికారులకు సూచించారు. పోలీస్, ఎక్సైజ్ శాఖ అధికారులు నిఘా పెంచాలని సూచించారు. కల్తీ కల్లు విక్రయానికి పాల్పడుతున్న వారిపై కఠినంగా వ్యవహరించాలన్నారు. వికారాబాద్ టూరిజానికి అనుకూలమైన

మిగతా 8వ పేజీలో...



ఎక్సైజ్ కార్యాలయ ఆవరణలో మొక్క నాటుతున్న మంత్రి జూపల్లి, స్పీకర్ ప్రసాద్‌కుమార్, చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి, తదితరులు





Sunday Special

గ్లామరస్.. గ్లాంప్ ఇన్ వ్యాలీ!

పర్యాటకులను ఆకట్టుకుంటున్న గుడారాలు

వీకెండ్స్‌లో సేద తీరుతున్న సెలబ్రిటీలు

పూడూరు మండలం తిర్మలాపూర్‌లో ఏర్పాటు

దేశంలోనే ఇది రెండోది





పూడూరు, జూలై 12 (ఆంధ్రజ్యోతి): దట్టమైన అడవి, ఎత్తైన కొండలు, కనుచూపు మేరలో పచ్చని చెట్లు.. ఇలాంటి ఆహ్లాదకరమైన వాతావరణంలో ఏర్పాటు చేసిన అందమైన గ్లాంప్ ఇన్ వ్యాలీ(అందమైన గుడారాలు) పర్యాటకులను ఆకర్షిస్తోంది. తెలంగాణ ఊటీగా ప్రసిద్ధి చెందిన వికారాబాద్ జిల్లా అనంతగిరి అటవీ ప్రాంతానికి సమీపంలోని పూడూరు మండలం తిర్మలాపూర్‌లో దీన్ని ఏర్పాటు చేశారు. హైదరాబాద్‌కు 60 కిలో మీటర్లు, గంట ప్రయాణంతో చేరుకునేలా ఉన్న

మిగతా 7వ పేజీలో...

కల్తీ వెల్లుల్లి పేస్ట్ పట్టివేత



తాండూరు రూరల్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గౌతాపూర్ చెక్‌పోస్టు వద్ద కల్తీ వెల్లుల్లి పేస్ట్ తరలిస్తుండగా కరన్‌కోట్ పోలీసులు పట్టుకున్నారు. ఏఎస్ఐ పవన్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. చెక్‌పోస్టు వద్ద శనివారం పోలీసులు వాహనాలు తనిఖీలు నిర్వహిస్తున్నారు. అదే సమయంలో తాండూరు నుంచి వచ్చిన ఆటో(నంబర్-34టీ4836)ను ఆపగా, అందులో అల్లం, వెల్లుల్లి పేస్టు డబ్బాలను గుర్తించారు. డ్రైవర్ సరైన పత్రాలు చూపకపోవడంతో కల్తీ వెల్లుల్లి పేస్టుగా గుర్తించి 87 కేజీలను స్వాధీనం చేసుకున్నారు. ఆటో డ్రైవర్ సజ్జదుల్లాఖాన్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి

» ఉపాధ్యాయ ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి

వికారాబాద్, జూలై 12 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి తాను కృషి చేస్తానని, విద్యా వ్యవస్థను పటిష్టవంతం చేసేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి అన్నారు. శనివారం వికారాబాద్‌లోని సత్యభారతి గార్డెన్స్‌లో నిర్వహించిన పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు కడియాల చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగిన కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడాలన్నారు. ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా కృషి చేస్తానన్నారు. అంతకు ముందు పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కడియాల చంద్రశేఖర్ మాట్లాడుతూ, ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయుల నిష్పత్తి పాటించేలా చూడాలన్నారు. ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులు విడుదల చేసే విధంగా, హెల్త్ కార్డులు ఇచ్చేవిధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకు రావాలని ఆయన ఎమ్మెల్సీకి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గుండు లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి పులుగం దామోదర్‌రెడ్డి, జిల్లా గౌరవ అధ్యక్షుడు వెంకట్ రాంరెడ్డి, దోమ అమర్‌నాథ్, తదితరులు పాల్గొన్నారు.

కో-లివింగ్ హాస్టళ్లపై చర్యలు తీసుకోండి


ఏసీపీ రాజుకు ఫిర్యాదు చేస్తున్న బీజేవైఎం నాయకులు

ఇబ్రహీంపట్నం, జూలై 12(ఆంధ్రజ్యోతి): ఆదిభట్ల మున్సిపాలిటీ పరిధిలో ఉన్న కో-లివింగ్ (ఆడ, మగ ఒకే హాస్టల్‌లో ఉండడం) హాస్టల్స్‌ను వెంటనే మూయించి యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బీజేవైఎం ఇబ్రహీంపట్నం నియోజకవర్గ కన్వీనర్ వన్నవాడ రవీందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజుకు బీజేవైఎం నాయకులు ఫిర్యాదు చేశారు. కో-లివింగ్ హాస్టల్స్ పేరున కొందరు అసాంఘిక కార్యకలాపాలను ప్రోత్సహిస్తున్నారని, ఇది సమాజానికి మంచి సంప్రదాయం కాదని రవీందర్‌రెడ్డి అన్నారు. అలాగే ఈ హాస్టళ్లతో చుట్టుపక్కల జనం ఇబ్బందులు పడుతున్నారని, ఇలాంటి హాస్టళ్లతో యువత చెడు దారి పట్టే అవకాశాలున్నాయని అన్నారు. ఏసీపీని కలిసిన వారిలో బీజేపీ ఇబ్రహీంపట్నం మున్సిపల్ అధ్యక్షుడు మహేందర్, మండల అధ్యక్షుడు శేఖర్‌రెడ్డి, రాఘవేందర్, వినయ్, బీరప్ప, విజయ్, శశిధర్‌రెడ్డి, సందీప్ ఉన్నారు.

చిత్ర కళాకారుడికి ప్రశంసా పత్రం


సున్నపు అశోక్

దౌల్తాబాద్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): గురు పౌర్ణమి సందర్భంగా కేంద్ర ప్రభుత్వ పెద్దల ఆదేశాల మేరకు వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన ప్రముఖులను సత్కరించే కార్యక్రమంలో భాగంగా ఢిల్లీకి చెందిన ఓ స్వచ్ఛంద సంస్థ పలువురికి ప్రశంసా పత్రాలను అందజేసింది. దౌల్తాబాద్ మండలం యాంకి గ్రామానికి చెందిన చిత్రకారుడు డాక్టర్ సున్నపు అశోక్‌కు భారతీయ రాష్ట్రీయ వికాస్ పరిషత్ సంస్థ, అఖిల భారత సామాజిక సామరస్య ఫౌండేషన్ సత్కరించారు. సామాజిక న్యాయానికి ద్రౌపది ముర్ము రాష్ట్రపతి గౌరవం, నరేంద్ర మోదీ జాతీయ ఐక్యత ప్రశంసా పత్రాలు అందించారు. ప్రశంసా పత్రాలను ఆన్‌లైన్ ద్వారా అందించినట్లు అశోక్ తెలిపారు. ఆయనను గ్రామస్తులు, కవులు, కళాకారులు అభినందించారు.

జైపాల్‌వి అసత్య ఆరోపణలు


మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

తలకొండపల్లి,జూలై12(ఆంధ్రజ్యోతి):కల్వకుర్తి నియోజకవర్గ అభివృద్ధిని, కాంగ్రెస్ ప్రజారంజక పాలనను ఓర్వలేకే మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ లేనిపోని ఆరోపణలు చేస్తూ ప్రజల్లో ప్రచారానికి పాకులాడుతున్నారని కాంగ్రెస్ నాయకులు అన్నారు. ప్రజలు ఓడించినా ఆయనలో మార్పు రాలేదన్నారు. గట్టిప్పలపల్లిలో శనివారం మాజీ వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు రేణురెడ్డి, డేవిడ్‌లు మాట్లాడుతూ.. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో గట్టిప్పలపల్లిని మండలంగా ఎందుకు చేయలేదని జైపాల్‌ను ప్రశ్నించారు. అధికారం పోయాక గట్టిప్పలపల్లి గుర్తొచ్చిందా? అని ఎద్దేవా చేశారు. అభివృద్ధి పనుల శంకుస్థాపనలకు ముగ్గురు మంత్రులొస్తే ఓర్వలేక బీఆర్ఎస్ నాయకులతో కలిసి కుట్ర రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. గ్రామానికి సబ్‌స్టేషన్‌ను అప్పటి ఎమ్మెల్యే, దివంగత ఎడ్మ కిష్టారెడ్డి, హాస్టల్‌ను మాజీ మంత్రి చిత్తరంజన్‌దాస్, ఆస్పత్రిని మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డిలు మంజూరు చేశారని గుర్తుచేశారు. ఎమ్మెల్యేగా జైపాల్ తమ గ్రామానికి ఏమీ చేయలేదన్నారు. కార్యక్రమంలో శివకుమార్‌గౌడ్, హరికిషన్‌రెడ్డి, నరేందర్‌గౌడ్, అంజయ్య, చంద్రమౌళి, మశ్చేందర్, శంకర్, శ్రీను, రాములు, రాహుల్, రమేశ్, పవన్‌వాల్మీకి, రామచంద్రి, వెంకట్‌రెడ్డి, శ్రీశైలం పాల్గొన్నారు.

ధారూరులో జాంబవ మహరాజ్ జయంతి

ధారూరు,జూలై12(ఆంధ్రజ్యోతి): ధారూరులోని అంబేడ్కర్ చౌరస్తాలో శనివారం ఆది జాంబవ మహరాజ్ జయంతిని మాదిగ జాగృతి సంఘం అధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో నర్సింహులు, వెంకటేశ్, అంజి, లక్ష్మణ్, ఆనంద్, అనిల్, రాజు, మహేష్ పాల్గొన్నారు.

కొత్తగూడలో భక్తిశ్రద్ధలతో...
నటరాజ సాంబ వివాహ హోమం


శక్తిపీఠంలో నటరాజ సాంబ వివాహ హోమం నిర్వహిస్తున్న భక్తులు


నటరాజ సాంబ విగ్రహానికి పూజలు

శంకర్‌పల్లి, జులై 12(ఆంధ్రజ్యోతి): కొత్తగూడలోని శ్రీ పాతాళ త్రికోణ మహాసుందరి శక్తి పీఠంలో శనివారం నటరాజ సాంబ వివాహ హోమాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం 6గంటలకు పూజారి అమిత్ పంతులు ఆధ్వర్యంలో నటరాజసాంబ స్వామివారి వివాహ హోమం, సాయంత్రం అఖండ కారిక హోమాన్ని జరిపించారు. ఈ కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై మొక్కులు తీర్చుకున్నారు. తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. నటరాజ సాంబ వివాహ హోమంతో ఆయుః సిద్ధి, కమల యోగాలు కలుగుతాయని, అఖండ కారిక హోమంతో రాజయోగం, బుద్ధి, సిద్ధిస్తా యని పూజారి అమిత్ పంతులు వివరించా రు. 9 రోజులు ఉదయం, సాయంత్రం నిర్వహించే పూజల్లో భక్తులు భారీగా పాల్గొనాలని ధర్మాధికారి మాధవరెడ్డి కోరారు.

స్థానిక ఎన్నికలు ఎప్పుడొచ్చినా కాంగ్రెస్‌దే విజయం


క్యాంప్ కార్యాలయంలో మాట్లాడుతున్న డా.పర్ణికారెడ్డి, పక్కన ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు, జూలై 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు వచ్చినా కాంగ్రెస్ పార్టీనే విజయం సాధిస్తుందని చేవెళ్ల పార్లమెంటరీ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి, నారాయణపేట్ ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి అన్నారు. శుక్రవారం రాత్రి క్యాంప్ కార్యాలయంలో తాండూరు నియోజకవర్గ ముఖ్య నాయకులతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పార్టీ పదవుల కోసం అభ్యర్థుల నుంచి వచ్చిన దరఖాస్తులను నాలుగు దశల్లో పరిశీలిస్తామని తెలిపారు. ఏ నాయకుడి పైరవీతోనో పదవులు రావని, క్షేత్రస్థాయిలో పనిచేసిన వారికే పార్టీ పదవులు, ఎన్నికల్లో పోటీకి టికెట్లు వరిస్తాయని తెలిపారు. దరఖాస్తులు పరిశీలించిన తర్వాత మొదటి ముగ్గురికి అధిష్ఠానం నుంచి పిలుపువస్తుందని చెప్పారు. పార్టీ అభ్యర్థుల గెలుపునకుఅందరూ సమష్టిగా పనిచేయాలని కోరారు. ఈ నెల 15వ తేదీ నాటికి కమిటీల నియామకాలు పూర్తి చేస్తామన్నారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు. తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆశావహుల దరఖాస్తులను పూర్తి పారదర్శకంగా పరిశీలించి ఎంపిక చేస్తామని చెప్పారు. గతంలో పార్టీ పదవులను హైదరాబాద్‌లో కూర్చొని ప్రకటించేవారని, ఇప్పుడు ఆ పద్ధతి మారిందని తెలిపారు. ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించే బాధ్యత తనదేనని చెప్పారు. సమావేశంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి ధారాసింగ్, ఉమ్మడి జిల్లా డీసీసీ వైస్‌చైర్మన్ రవిగౌడ్, నాయకులు సంపత్‌కుమార్, కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు హబీబ్ లాల పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ రోజుకో మాట



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్, పాల్గొన్న నాయకులు

వికారాబాద్, జూలై 12(ఆంధ్రజ్యోతి): బీసీల రిజర్వేషన్‌పై కాంగ్రెస్ ప్రభుత్వం రోజుకో మాట మాట్లాడుతోందని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మెతుకు ఆనంద్ విమర్శించారు. శనివారం వికారాబాద్‌లోని జిల్లా పార్టీ కార్యాలయంలో నాయకలతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. బీసీ అంటూ ఎన్నికల సమయంలో కామారెడ్డిలో సభపెట్టి అధికారంలోకి వస్తే ఆరు నెలల్లో బీసీ రేషర్వేషన్లు పూర్తి చేస్తామని చెప్పి 18 నుంచి 20 నెలలు గడుస్తున్నా ఆ హామీ అమలు చేయలేదన్నారు. బిల్లు ద్వారా రిజర్వేషన్లు ఇస్తామని ఒకసారి, పార్టీ పరంగానే అమలు చేస్తామని మరొకసారి చెప్పడం ప్రజలను తప్పుదోవ పట్టించడమేనని అన్నారు. అసెంబ్లీలో బిల్లు పాసైనా చట్టబద్ధత పొందాలంటే గవర్నర్, రాష్ట్రపతిల ఆమోదం తప్పనిసరి అన్నారు. రాజ్యాంగం ప్రకారం రిజర్వేషన్లు 50శాతానికి మించకూడదనే నిబంధన ఉన్నా తమిళనాడులో 69శాతం రిజర్వేషన్లు కొనసాగుతున్నాయని ప్రస్తావించారు. 9వ షెడ్యూల్‌లో చేర్చడంతో ఇది సాధ్యమైందన్నారు. బిల్లు చట్టబద్ధతకు కేంద్ర ప్రభుత్వ సహకారం అవసరమని స్పష్టం చేశారు. మహారాష్ట్ర, బిహార్, కేరళ రాష్ట్రాల్లో ఆర్డినెన్స్‌లు ఫలించని సందర్భాలను ఆనంద్ ఉదహరించారు. కేంద్రం ఆమోదంతోనే రాష్ట్రంలో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు వస్తాయన్నారు. బీసీ సబ్‌ప్లాన్ లేదని విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లను గాలికొదిలేశారని అన్నారు. సమావేశంలో బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్‌పటేల్, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు గోపాల్, మండల అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

'విద్యార్థిని చితకబాదిన హెడ్ మాస్టర్‌పై చర్యలు తీసుకోవాలి'

షాబాద్, జూలై 12(ఆంధ్రజ్యోతి): ఆదర్శంగా ఉండి విద్యాబుద్ధులు నేర్పాల్సిన ప్రధానోపాధ్యాయుడు విద్యార్థిని బూటు కాలితో తన్ని, కొట్టిన సంఘటన షాబాద్‌లో చోటుచేసుకుంది. షాబాద్‌కు చెందిన రాకేశ్ బాలుర పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్నాడు. శుక్రవారం తోటి విద్యార్థి స్కూల్ బ్యాగ్‌ను రాకేశ్ వెనక బెంచీలో పెట్టాడని గొడవపడ్డారు. రాకేశ్‌పై తోటి విద్యార్థి హెచ్ఎంకు ఫిర్యాదు చేశాడు. దీంతో హెచ్ఎం గోవింద్ రాకేశ్‌ను చితకబాదగా కింద పడిపోయాడు. కిందపడ్డ బాలుడిని బూటుకాలితో తన్ని వాంతులొచ్చేలా కొట్టాడు. ఈ విషయం తెలుసుకున్న పీడీఎస్‌యూ నాయకులు పాఠశాలకు చేరుకొని హెచ్ఎంను ప్రశ్నించగా.. "నా స్కూల్.. నా ఇష్టం. నువ్వెవరు అడగడానికి? ఏం చేసుకుంటావో చేస్కో పో." అని అన్నాడని విద్యార్థి సంఘం నాయకులు తెలిపారు. ఈ హెచ్ఎం ఆగడాలపై తల్లిదండ్రులు ఎన్నోసార్లు అధికారులకు ఫిర్యాదు చేశారని, వారు పట్టించుకోవడంలేదన్నారు. షాబాద్ ఎస్సీ హాస్టల్ విద్యార్థులను సైతం బూతులు తిడతాడని ఆరోపించాడు. కలెక్టర్, డీఈవో ఈ సంఘటనపై విచారణ చేయించి గోవిందుపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు.

19 నుంచి కొడంగల్ వేంకటేశ్వరస్వామి పవిత్రోత్సవాలు



కొడంగల్, జూలై 12(ఆంధ్రజ్యోతి): పేదల తిరుమలగా పేరొందిన కొడంగల్‌లోని మహాలక్ష్మీవేంకటేశ్వరస్వామి పవిత్రోత్సవాలను రెండేళ్లకోసారి తిరుమల తరహాలోనే నిర్వహిస్తారు. ఈ నెల 19 నంచి పవిత్రోత్సవాలు ప్రారంభం కానున్నట్లు ఆలయ ధర్మకర్తలు శనివారం తెలిపారు. భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు. టీటీడీ అర్చకులతో పాటు ఆలయ అర్చకులు పాల్గొని ఉత్సవ కార్యక్రమాలను నిర్వహిస్తారని పేర్కొన్నారు. పవిత్రోత్సవాలు 22న ముగుస్తాయని తెలిపారు.

ఇంటి నిర్మాణానికి ఉప్పల ట్రస్ట్ చేయూత


మెటీరియల్‌తో మహేశ్

తలకొండపల్లి, జూలై 12(ఆంధ్రజ్యోతి): రామకృష్ణాపురానికి చెందిన మహేశ్ ఇంటి నిర్మాణానికి మాజీ జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ చేయూతనిచ్చారు. తన ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా నిర్మాణ మెటీరియల్‌ను సమకూర్చగా శనివారం ట్రస్ట్ సభ్యులు అందజేశారు. ఏఎంసీ మాజీ చైర్మన్ ఎన్.శ్రీనివాస్‌రెడ్డి, ట్రస్ట్ సభ్యులు, నాయకులు ఇమ్రాన్, శ్రీనివాస్‌గౌడ్, యలమందరెడ్డి, యాదయ్య, మహేశ్, ప్రమోద్, జంగయ్య, రామచంద్రయ్య, విజయ్ పాల్గొన్నారు.



కమ్యూనిటీ హాలు ప్రొసీడింగ్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే శంకర్

50లక్షలతో మొగిలిగిద్దలో కమ్యూనిటీ హాల్

షాద్‌నగర్ అర్బన్, జూలై 12(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హామీ మేరకు ఫరూఖ్‌నగర్ మండలం మొగిలిగిద్దలో రూ.50 లక్షలతో మైనారిటీ కమ్యూనిటీ హాలును నిర్మిస్తున్నామని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు. మైనార్టీ కార్పొరేషన్ నుంచి మంజూరైన 50లక్షల ప్రొసీడింగ్‌ను శనివారం గ్రామ కాంగ్రెస్ నాయకులకు అందజేశారు. దీంతో మైనారిటీలు ముఖ్యమంత్రికి, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్‌చైర్మన్ బాబర్‌ఖాన్, జి.బాల్‌రాజ్‌గౌడ్, శ్రీకాంత్‌రెడ్డి, విజయ్‌కుమార్, రవూఫ్ పాషా, లతీఫ్, ఖలీల్, షబ్బీర్ పాల్గొన్నారు.



పల్లకీసేవ నిర్వహిస్తున్న భక్తులు

భక్తిశ్రద్ధలతో హనుమాన్ పల్లకీసేవ

షాద్‌నగర్ అర్బన్, జూలై 12(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ మున్సిపాలిటీలోని చౌడమ్మగుట్ట ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం స్వామి వారి పల్లకీసేవను నిర్వహించారు. భజన పాటలు పాడుతూ ఆలయం చుట్టూ పల్లకీసేవను కొనసాగించారు. అనంతరం పూజారి రఘుపతిరావు తీర్థప్రసాదం పంచారు. ఆలయంలో భజన కోసం ఈశ్వర్‌కాలనీకి చెందిన అనుమారి వేణుగోపాల్ మేళతాళాలను బహూకరించారు. కార్యక్రమంలో అలయ అభివృద్ధి కమిటీ కన్వీనర్ పి.శ్రీశైలంగౌడ్, జి.వసంతరావు, ఎల్.రఘుగౌడ్, జి.రమేష్, జి.శ్రీనివాస్, ప్రవీణ్‌యాదవ్, ఎస్.నర్సింహులు, కిషన్‌నాయక్, రాఘవేందర్, నారాయణ, బి.కృష్ణయ్య, లక్ష్మీకాంత్‌రెడ్డి, బచ్చన్న తదితరులు పాల్గొన్నారు.



పూజల్లో యాట నర్సింహ, శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, విజితారెడ్డి

దైవ కార్యక్రమాలతో సమాజ శాంతి

కడ్తాల్, జూలై 12(ఆంధ్రజ్యోతి): దైవ, ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజ శాంతి స్థాపనకు దోహదం చేస్తాయని పీసీసీ సభ్యులు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్, డీసీసీ ప్రధాన కార్యదర్శి బిక్యానాయక్, మాజీ జెడ్పీటీసీ విజితారెడ్డి, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహులు అన్నారు. అన్మాస్‌పల్లిలోని వీరాంజనేయస్వామి ఆలయంలో శనివారం సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు. కొర్పోలు నవీన్‌కుమార్ రెడ్డి-శ్వేత దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించిన పూజల్లో భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమానికి నాయకులు హాజరయ్యారు. ఆలయాల అభివృద్ధికి ప్రతీ ఒక్కరు తోడ్పాటునందించాలన్నారు. అన్మాస్‌పల్లి ఆలయం ప్రశాంతతకు నిలయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీజీఆర్ అధ్యక్షురాలు లీలాలక్ష్మారెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బిచ్యానాయక్, బాల్‌రాజ్, శంకర్, నంద్య, అనిల్, జగన్, లక్ష్మీ, శంకర్, ఆనంద్‌రెడ్డి, జోగు వీరయ్య, జి.లక్ష్మయ్య, రామకృష్ణ పాల్గొన్నారు.



కరీం కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న విప్ మహేందర్‌రెడ్డి

మృతుడి కుటుంబానికి చీఫ్ విప్ పరామర్శ

తాండూరు రూరల్, జూలై 12(ఆంధ్రజ్యోతి): ఇటీవల మృతిచెందిన దస్తగిరిపేట్‌కు చెందిన తాండూరు మార్కెట్ కమిటీ డైరెక్టర్ భగవాన్ కరీం కుటుంబాన్ని ప్రభుత్వ చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి శనివారం పరామర్శించారు. మహేందర్‌రెడ్డి వెంట కాంగ్రెస్ నాయకులు కరణం పురుషోత్తంరావు, పరిమళ, రవీందర్, రాజు, సలీం, బీదర్ రాజశేఖర్ ఉన్నారు.



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యేలు పర్ణిక, మనోహర్‌రెడ్డి

'ఆదర్శ' దంపతులకు ప్రోత్సాహకం అందజేత

పెద్దేముల్, జూలై 12(ఆంధ్రజ్యోతి): కులాంతర వివాహం చేసుకున్న దంపతులకు ప్రభుత్వం ప్రోత్సాహకం కింద రూ.2.5లక్షలు మంజూరు చేసింది. నాగులపల్లికి చెందిన హరిజన తుల్జారాం, చెంగోల్‌కు చెందిన గాయత్రి రెండేళ్ల కింద కులాంతర వివాహం చేసుకున్నారు. వారికి ప్రభుత్వం నుంచి ఆర్థికసాయం మంజూరవడంతో తాండూరు క్యాంప్ కార్యాలయంలో నారాయణపేట్, తాండూరు ఎమ్మెల్యేలు పర్ణికారెడ్డి, బుయ్యని మనోహర్‌రెడ్డిలు చెక్కును అందజేశారు.



మున్సిపల్ సిబ్బందికి వినతిపత్రం ఇస్తున్న కాలనీ వాసులు

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

పరిగి, జూలై 12(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని 13వ వార్డు బీసీకాలనీలో తాగునీటి బోరు రిపేర్ చేయించాలని కాలనీవాసులు శనివారం మున్సిపల్ సిబ్బందికి వినతిపత్రం ఇచ్చారు. తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. అధికారులు సమస్య పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.

గ్లామరస్.. గ్లాంప్ ఇన్ వ్యాలీ!

(ఐదో పేజీ తరువాయి)

వ్యాలీ హైదరాబాద్ - బీజాపూర్ జాతీయ రహదారి పక్కనే ఉంది. దేశంలోనే ఇది రెండోది. ఒకటి కేరళలో ఉండగా, మరొకటి తిర్మలాపూర్‌లో ఉంది. హైదరాబాద్‌కు చెందిన రిషిక్‌రెడ్డి అనే యువకుడు నాలుగేళ్ల క్రితం దీన్ని ఏర్పాటు చేశారు.

అన్ని వసతులతో..

ఇక్కడ ప్రకృతి అందాలను వీక్షించేందుకు వ్యూ పాయింట్లను కూడా ఏర్పాటు చేశారు. ఈ గ్లాంప్ ఇన్‌లో బెడ్ రూం, వాష్ రూం, కిచెన్, కుర్చీలు తదితర సౌకర్యాలు ఏర్పాటు చేశారు. ఫ్యామిలీతో వచ్చిన వారికి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. చిన్న పిల్లలకు జంపింగ్ ఆట వస్తువులు, స్విమ్మింగ్ పూల్, చలికాలంలో మంటలు వేసుకునేందుకు అవసరమైన హంగులతో కూడిన సౌకర్యాలు ఇక్కడ ఉన్నాయి. ఇక్కడికి వచ్చే వారికి వారికి భోజనానికి ఎలాంటి ఇబ్బంది ఉండదు. ఇక్కడ ఆంధ్ర, తెలంగాణకు సంబంధించిన వంటకాలు రుచిచూసే ఏర్పాట్లు చేశారు. కాగా, ఈ గ్లాంప్ ఇన్ వ్యాలీకి సెలబ్రిటీల తాకిడి రోజురోజుకూ



పెరుగుతోంది. సినీ హీరో నాగ చైతన్య, దర్శకులు, క్యారెక్టర్ ఆర్టిస్టులు ఇక్కడికి వెకేషన్‌కు వస్తుంటారు.

గ్లాంప్ ఇన్ వ్యాలీ నా కల

గ్లాంప్ ఇన్ వ్యాలీ నిర్మాణాలు నా కల. పర్యాటకులు, సెలబ్రిటీలు సేద తీరేందుకు చాలా మంది ఇతర ప్రాంతాలకు వెళ్తుంటారు. అలాంటి గ్లాంప్ ఇన్ వ్యాలీ మన రాష్ట్రంలోనే ఏర్పాటు చేయాలనే ఆలోచనతో ఈ నిర్మాణాలు చేపట్టాం. తిర్మాలాపూర్ అటవీ ప్రాంతం ఎంతో ఆహ్లాదకరంగా ఉంటుంది. అందుకే ఈ ప్రాంతాన్ని ఎంచుకున్నాం. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా ఇక్కడికి పర్యాటకులు వస్తుంటారు. ఈ మధ్య సినీ ప్రముఖులు కూడా అధిక సంఖ్యలో వస్తున్నారు.



- రిషిక్‌రెడ్డి, ఎండీ, గ్లాంప్ ఇన్ వ్యాలీ

వాడుతున్న మొలకలు

- వర్షాల్లేక చేలల్లో నిలిచిన ఎదుగుదల
- వానల కోసం రైతుల ఎదురుచూపు
- వేసిన పంటలు ఉంటాయో.. పోతాయోనని ఆందోళన

చేవెళ్ల, జూలై 12(ఆంధ్రజ్యోతి): ఈ వానాకాలంలో ఇప్పటి వరకు భారీ వర్షాలేమీ కురవలేదు. చిన్నపాటి వానలకు విత్తుకున్న పంటల మొలక శాతం తగ్గింది. వచ్చిన మొలకలూ వాడుతున్నాయి. భూమి రెండు ఫీట్ల లోతు కూడా నానలేదని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైతే వర్షాభావ పరిస్థితే ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆశగా మేఘాల వంక చూస్తున్నారు. చేవెళ్ల డివిజన్‌లో పత్తి, మొక్కజొన్న, కంది, కూరగాయ పంటల సాగు అనుకున్నంత చేయలేదు. 82,649 ఎకరాల్లో సాగు చేశారని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. డివిజన్‌లో పత్తి తర్వాత మొక్కజొన్న, కంది ఎక్కువ వేస్తారు. కూరగాయ పంటలకు సైతం ప్రాధాన్యం ఇస్తారు. జూన్ 29, 30 తేదీల్లోనే వర్షం కురిసింది. జూలై మొదటి వారంలో కురిసిన రెండు వర్షాలు మొలకలకు ప్రాణం పోశాయి. ఇక అప్పటి నుంచి ఎండలే కాస్తుండడంతో ఇది ఎండకాలమా? వానకాలమా? అని రైతులు దిగులు చెందుతున్నారు. పత్తి రైతులు ఎకరానికి రూ.20వేల నుంచి 25వేల ఖర్చు చేశారు. ఈ పంట 31,220 ఎకరాల్లో సాగుచేశారు. మే చివర, జూన్ మొదటి వారంలో



చేవెళ్లలోని ఓ పొలంలో వాడిపోయిన పత్తి మొలకలు

ఎక్కువ మంది పత్తి విత్తుకున్నారు. ఆ తర్వాత 15 నుంచి 20రోజులు వర్షాల్లేక మొలక శాతం బాగా పడిపోయింది. వేడికి మొలక భూమిలోనే ఎండింది. జూలై మొదట్లో కురిసిన చిన్నపాటి వానలకు మొలకలు రాని చోట్ల మరోసారి విత్తనం నాటారు. దీంతో రైతులకు పెట్టుబడి ఖర్చు మరింత పెరిగింది. పత్తి విత్తుకునేందుకు జూలై మూడో వారం వరకు అనువుగా ఉంటుందని, ఆ తర్వాత వానలు పడినా రైతులు ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

రెండుమూడు రోజుల్లో వాన కురవకుంటే...

ఈ ఏడాది మే నెల చివరలోనే రుతుపవనాల ఆగమనంతో వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని రైతులు సంతోషించారు. విత్తనాలు వేసుకున్న తరువాత వర్షాలు కురవక మొలకలు వాడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరో రెండుమూడు రోజుల్లో చిన్నపాటి వానైనా కురవకుంటే మొక్కలు ఎండిపోతాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భూమిపై పస్కు లేక పశువులకు మేత కూడా కరువయ్యే పరిస్థితి ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వానలు పడాలని ఆలయాల్లో విగ్రహాలకు జలాభిషేకాలు, కప్పకావడి, గ్రామ దేవతలకు పూజలు చేస్తున్నారు.

ముందు మురిపించి..



ఈ ఏడాది వానాకాలం ముందే ప్రారంభమైందని సంతోషంతో పంటలు వేస్తే పది రోజులుగా వర్షాల్లేక మొలకలు మాడుతున్నాయి. పత్తి మొలకల ఎదుగుదల మూడాకుల వద్దే నిలిచింది. సరిగ్గా వానలు పడితే ఇప్పటికే పత్తికి ఒకసారి రసాయన ఎరువు వేసే వాళ్లం. వాన కోసం ఎదురు చూస్తున్నాం. వర్షాభావంతో పంట దిగుబడి భారీగా పడిపోతుంది.

- జనార్దన్, రైతు, మీర్జాగూడ



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో అనిల్

సీఎంను కలిసిన తాండూరు కాంగ్రెస్ నాయకుడు

తాండూరు రూరల్, జూలై 12(ఆంధ్రజ్యోతి):వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో తాండూరు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపునకు పనిచేసేలా ప్రతి కార్యకర్తను చైతన్యపర్చాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. శనివారం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తుపాకుల అనిల్.. సీఎంను హైదరాబాద్‌లో కలిశారు. ఆయనతో సీఎం మాట్లాడుతూ.. స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తా చాటాలని అన్నారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలపై ప్రజల్లో ప్రచారం చేయాలని సూచించారు. పనిచేసే కార్యకర్తలకు గుర్తింపు తప్పక ఉంటుందన్నారు. సీఎంను కలిసిన వారిలో కొడంగల్ నియోజకవర్గ కాంగ్రెస్ అధ్యక్షుడు రెడ్డి సీను, తదితరులు ఉన్నారు.

బీసీలకు పెరగనున్న పదవులు!

- 42శాతం రిజర్వేషన్లతో అందివచ్చే అవకాశం
- కుల గణనే ప్రామాణికం

తాండూరు, జూలై 12(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్‌లు అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. దీంతో స్థానిక సంస్థల్లో బీసీ ప్రజా ప్రతినిధుల సంఖ్య భారీగా పెరగనుంది. ఇది అన్ని పార్టీల బీసీ నాయకులకు కలిసొచ్చే అవకాశం. ఎన్నికల నోటిఫికేషన్ రావడమే తరువాయి.. పోటీకి రెడీ కావాలని బీసీ వర్గాల నాయకులు ఉవ్విళ్లూరుతున్నారు. గత గురువారం జరిగిన రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో 42శాతం రిజర్వేషన్లు ప్రకటించాకే ఎన్నికలకు వెళ్లాలని ప్రభుత్వం నిర్ణయించింది. పెరిగే బీసీ రిజర్వేషన్లతో పార్టీల్లోనూ టికెట్ల కోసం పోటీ తక్కువగా ఉండే ఆస్కారం ఉంది. ఎంపీటీసీ, జెడ్పీటీసీ, సర్పంచ్ పదవుల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలుకు అనుకూలంగా ఉంది. బీసీ కోటాలో ఎంపీటీసీ, జెడ్పీటీ స్థానాల సంఖ్య పెరిగే చాన్స్ ఉంది.



ఈ మేరకు ఓసీ వర్గాల నాయకులకు అవకాశాలు తగ్గుతాయి. తాండూరు నియోజకవర్గంలో బీసీ జనాభా ఎక్కువగా ఉంది. నియోజకవర్గంలో 143 ఎంపీటీసీ స్థానాలు, నాలుగు జెడ్పీటీసీ స్థానాలు ఉన్నాయి. వాటిల్లో 42శాతం రిజర్వేషన్లు అమలైతే 61 ఎంపీటీసీ స్థానాలు, రెండు జెడ్పీటీసీ స్థానాలు బీసీలకు దక్కనున్నాయి. ఈ నేపథ్యంలో ఎన్నికల్లో పోటీ కోసం అన్ని రాజకీయ పార్టీలు బలమైన బీసీ లీడర్లను గుర్తించే పని నిమగ్నమయ్యారు.



విలేకరుల సమావేశంలో పాండుయాదవ్, నాయకులు

రిజర్వేషన్ పేరుతో బీసీలకు మోసం

మహేశ్వరం, జూలై 12(ఆంధ్రజ్యోతి): బీసీలకు 42శాతం రిజర్వేసన్ పేరుతో మోసానికి కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రకు తెరలేపిందని, ఎన్నికల్లో లబ్ధిపొందేందుకే చట్టబద్ధత లేని రిజర్వేషన్ విధానంతో డ్రామా ఆడుతోందని, ప్రభుత్వాన్ని బీసీలు నమ్మొద్దని మహేశ్వరం ప్యాక్స్ చైర్మన్ మంచె పాండుయాదవ్ అన్నారు. శనివారం విలేకరులతో మాట్లాడుతూ.. 42శాతం రిజర్వేషన్లపై జీవో జారీ చేయాలని, కేవలం పార్టీ పరంగా ప్రకటిస్తూ మోసం చేస్తున్నారన్నారు. 42శాతం రిజర్వేషన్లు అమలుకావాలంటే పార్లమెంట్‌లో బిల్లు ఆమోదం తప్పనిసరి అన్నారు. అలా కాకుండా రాష్ట్రమే సొంతంగా అమలుచేస్తే కోర్టుల్లో అది నిలవదన్నారు. బీజేపీ, బీఆర్‌ఎస్‌లు కూడా చట్టబద్ధతపై మాట్లాడకుండా బీసీ రిజర్వేషన్లు ఇవ్వాలని అనడం సమంజసం కాదన్నారు. కాంగ్రెస్ మోసాలను బీసీ వర్గాల మేధావులు, నాయకులు ఆలోచించాలన్నారు. కాంగ్రెస్ ఎన్ని ఎత్తులు వేసినా ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌దే విజయం అన్నారు. సమావేశంలో బీసీ నాయకులు అంబయ్యయాదవ్, మనోహర్, బాలయ్య, నవీన్, లింగం, ప్రభాకర్, రమేష్, దేవవరం, వెంకటేష్ పాల్గొన్నారు.

టీకాలపై విద్యార్థులకు అవగాహన

తాండూరు రూరల్, జూలై 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని గౌతాపూర్ పాఠశాలను శనివారం బెల్కటూర్ సబ్ సెంటర్ ఏఎన్‌ఎం పుష్ప సందర్శించారు. విద్యార్థులకు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏయే వయస్సుల్లో పిల్లలు ఏ టీకా వేసుకోవాలో విడమర్చారు. అనంతరం గ్రామంలో బాలింతలకు ఇవ్వాల్సిన పోషణపై అవగాహన కల్పించారు. 6 నెలలు దాటిన శిశువులకు తల్లిపాలకు అదనంగా పోషకాహారాన్ని అందించాలని తెలిపారు. అంగన్‌వాడీల్లో ఇచ్చే బాలామృతం పిల్లలకు బలవర్ధకం అని, అవగాహన లేక దానికి సరిగ్గా వినియోగించడం లేదని చెప్పారు. అరటి పండు, ఉగ్గు, రాగిజావ, మిల్లెట్ల ఉగ్గు తయారీపై బాలింతలు, మహిళలకు వివరించారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఏఎన్ఎం

మొక్కలను సంరక్షిస్తేనే మానవాళి మనుగడ

కడ్తాల్, జూలై 12(ఆంధ్రజ్యోతి): అడవుల సంరక్షణ, వృక్ష సంపద పెంపునకు ప్రతి ఒక్కరు కృషిచేయాలని అఖిలాంధ్ర సాధు పరిషత్ అధ్యక్షుడు పరమాత్మ గిరిస్వామి అన్నారు. మొక్కలను భారీగా నాటి అవి వృక్షాలుగా మారేంత వరకు సంరక్షిస్తేనే మానవాళి మనుగడ, వాతావరణ సమతుల్యత సాధ్యం అని చెప్పారు. కడ్తాలలోని హనుమాన్ ఘాట్ వద్ద శనివారం వేదపండితులు మెల్లూరి వెంకటేశ్వరశర్మ ఆధ్వర్యంలో మొక్కల పెంపకం కార్యక్రమాన్ని నిర్వహించారు. గిరిస్వామి, కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ అధ్యక్షురాలు లీలాలక్ష్మారెడ్డి, సీఐ గంగాధర్, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. హనుమాన్ ఆలయ ప్రాంగణంలో వివిధ పండ్లు, పూల మొక్కలను నాటారు. ప్రతి ఆలయం



మొక్కలు నాటుతున్న పరమాత్మగిరి స్వామి, వెంకటేశ్వరశర్మ, లీలాలక్ష్మారెడ్డి

మొక్కలను నాటి సంరక్షించాలని అన్నారు. భావితరాలను దృష్టిలో ఉంచుకొని ప్రతీ పౌరుడు మొక్కలు నాటాలని స్వామీజీ సూచించారు. దైవ కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరు పాలుపంచుకోవాలని కోరారు. కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ సంస్థ చేపడుతున్న సామాజిక సేవ, పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలను పరమాత్మగిరి స్వామి అభినందించారు. కార్యక్రమంలో ఎస్ఐ చంద్రశేఖర్, నాయకులు జంగారెడ్డి, రాములు, గంజి అంజయ్య, బాచిరెడ్డి మల్లారెడ్డి, భిక్షపతి, మల్లయ్య, వెంకటేశ్, రఘుపతి రెడ్డి, జంగయ్య, అర్చకుడు శ్రీమన్నారాయణ, వెంకటేశ్వరశర్మ పాల్గొన్నారు.

కార్యదర్శిపై సస్పెన్షన్ వేటు తగదు

తలకొండపల్లి, జూలై 12(ఆంధ్రజ్యోతి):పంచాయతీ ట్రాక్టర్‌కు డీజిల్ కోసం బీఆర్‌ఎస్ చేపట్టిన భిక్షాటనతో సంబంధం లేని పంచాయతీ కార్యదర్శి అనితను సస్పెండ్ చేయడం తగదని బీఆర్‌ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు వెంకటయ్య, కృష్ణయ్య అన్నారు. గట్టిప్పలపల్లి పంచాయతీ చెత్త సేకరణ ట్రాక్టర్ నిర్వహణకు డబ్బుల్లేక ట్రాక్టర్ తాళం చెవిలను ఎంపీడీవోకు ఇచ్చారన్న సమాచారంతో.. తామే ట్రాక్టర్ నిర్వాహణ డబ్బులకు భిక్షాటన చేశామని గట్టిప్పలపల్లిలో శనివారం మాట్లాడుతూ చెప్పారు. తాము పార్టీ పరంగా చేసిన కార్యక్రమానికి ఉద్యోగినిని బాధ్యురాలిగా చేయడం ప్రభుత్వ కక్షసాధింపు చర్యే అన్నారు. కార్యదర్శిపై సస్పెన్షన్‌ను ఎత్తివేయాలన్నారు. నాయకులు జంగయ్య, శరత్‌చంద్రశర్మ, కృష్ణయ్య, రవీందర్, నర్సింహ, పురుషోత్తం, విజేందర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చంద్రశేఖర్‌రెడ్డి, వెంకటయ్య

బర్త్ సర్టిఫికెట్‌కు రూ.5వేలు డిమాండ్!

● పంచాయతీ కార్యదర్శి తీరుపై ఆగ్రహం

దౌల్తాబాద్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): బర్త్ సర్టిఫికెట్‌కు రూ.5వేలు ఇవ్వాల్సిందేనని పంచాయతీ కార్యదర్శి డిమాండ్ చేస్తున్నాడని గ్రామస్థులు అశోక్, రాములు తెలిపారు. దౌల్తాబాద్ మండలంలోని గుమ్మాల పంచాయతీ కార్యదర్శి బీ.బాబు బర్త్ సర్టిఫికెట్, పింఛన్‌లు, ఇంటి నిర్మాణానికి అనుమతుల కోసం ఒక్కోపనికి ఒక్కోరేటు డిమాండ్ చేస్తున్నాడని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తాజాగా శనివారం గ్రామస్థులు అశోక్, రాములు పంచాయతీ కార్యదర్శికి ఫోన్‌చేయగా రూ.5వేలు ఇస్తేనే బర్త్ సర్టిఫికెట్ ఇస్తామని చెప్పినట్లు సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి బీ.బాబును వివరణ కోరగా అలాంటిదేమి లేదని సమాధానం దాటవేశారు.

ప్రభుత్వ భూముల్లో ఈత, తాటి, ఖర్జూర
మొక్కలు నాటాలి

(ఐదో పేజీ తరువాయి)

ప్రదేశమన్నారు. అనంతగిరి ప్రాంతాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులతో అభివృద్ధి చేస్తామని ఈ సందర్భంగా వారు హామీ ఇచ్చారు.

గీత కార్మికుల అభివృద్ధికి ప్రోత్సాహం: స్పీకర్

స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ గీత కార్మికుల ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం ప్రోత్సహిస్తుందన్నారు. ప్రభుత్వ భూముల్లో ఈత, తాటి వనాలను పెంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. చీఫ్‌విప్ మహేందర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా అద్దె భవనాల్లో కార్యాలయాలు నిర్వహించకుండా ఉండేందుకు ఎక్సైజ్ శాఖ రాష్ట్ర వ్యాప్తంగా 14 భవనాలను నిర్మిస్తుందన్నారు. ఎంపీ విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ పల్లెల్లో కూడా డ్రగ్స్ వ్యాపిస్తున్నాయన్నారు. దీనిపై నిఘా పెంచాలని సూచించారు. ఎమ్మెల్యే యాదయ్య మాట్లాడుతూ ఫాంహౌస్‌లు, రిసార్ట్‌లో మద్యం సేవిస్తే కేసులు చేస్తున్నారన్నారు. ఈ విషయాల్లో ఎక్సైజ్ శాఖ అనుమతులు లేని వాటిపై చర్యలు తీసుకుంటే బాగుంటుందన్నారు. అంతకు ముందు కార్యాలయ ఆవరణలో మంత్రి, స్పీకర్ అధికారులతో కలిసి ఈత మొక్కలను నాటి నీరు పోశారు. కార్యక్రమంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ దశరథ్, సూపరింటెండెంట్ విజయ భాస్కర్, అదనపు కలెక్టర్ ఎం. సుధీర్, డీసీసీబీ డైరెక్టర్ కిషన్ నాయక్, ఆర్డీవో వాసుచంద్ర, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, ఎక్సైజ్ సీఐ రాఘవీణా, నాయకులు సత్యనారాయణ, సుధాకర్ రెడ్డి, చిగుళ్లపల్లి రమేష్, శ్రీనివాస్ గౌడ్, అనంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

బాల్కనీ నుంచి పడి వ్యక్తి మృతి

మూడుచింతలపల్లి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు బాల్కనీ నుంచి పడి ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన శామీర్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తూంకుంట మున్సిపల్ పరిధిలోని డబుల్‌బెడ్ రూంలో షేక్ ఫరీద్(36) నివాసముంటూ కూలీపనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కాగా ఫ్లాట్ నంబర్ 169బాల్కనీలో కూర్చొని ఉండగా ప్రమాదవశాత్తు అదుపుతప్పి కిందపడి మృతిచెందాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అయ్యప్ప స్వామి ఆలయంలో చోరీ

మేడ్చల్ టౌన్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మేడ్చల్ పట్టణం అయ్యప్ప స్వామి ఆలయంలో దుండగులు చొరబడి హుండీని, పూజా సామగ్రిని ఎత్తుకెళ్లారు. ఆలయ నిర్వాహకులు తెలిపిన వివరాల ప్రకారం శుక్రవారం రాత్రి గుర్తుతెలియని దుండగులు మేడ్చల్ పట్టణంలోని హౌజింగ్ బోర్డు కాలనీలోని అయ్యప్ప స్వామి ఆలయంలో చొరబడి ఆలయం హుండీని, పూజల కోసం వాడే ఇత్తడి పరికరాలను ఎత్తుకెళ్లారు. శనివారం విషయం గమనించిన ఆలయ నిర్వాహకులు మేడ్చల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. ఆలయ నిర్వాహకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. హుండీలో ఎంత నగదు ఉందనేది తెలియరాలేదు.

కుక్కదాడి.. ఆవు మృత్యువాత

ధారూరు, జూలై 12(ఆంధ్రజ్యోతి): పిచ్చికుక్క కరవడంతో ఆవు మృతి చెందిన ఘటన మండలంలోని నాగసమందర్ గ్రామంలో శనివారం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన రైతు వరద మల్లికార్జున్‌కు చెందిన ఆవును పిచ్చికుక్క కరిచింది. దీంతో ఆవు నోటి నుంచి నురగ వచ్చి మృత్యువాతపడింది. ఆవు విలువ రూ.30వేల వరకు ఉంటుందని యజమాని తెలిపాడు. కాగా పొలం గట్టుపై గుంతతవ్వి ఆవు మృతదేహన్ని ఖననం చేశారు. గ్రామంలో కుక్కల బెడద తీవ్రంగా ఉందని, పశువులను కుక్కల బారి నుంచి కాపాడుకోలేకపోతున్నామని స్థానికులు వాపోతున్నారు. అధికారులు కుక్కలను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

ఇసుక కొరత.. నత్తనడక!

(ఐదో పేజీ తరువాయి)

సాధారణ రకం రూ.2 వేలు, సన్నరకం రూ.2,400 పలుకుతోంది. ఇసుక ధరలు బాగా పెరిగిపోవడంతో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. ఇతర ప్రాంతాల నుంచి ఇసుకు తెచ్చుకునేందుకు లోడింగ్, ట్రాన్స్‌పోర్ట్, అన్‌లోడింగ్‌కయ్యే ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అవసరం మేరకే కొనుగోలు

తాండూర్, బొంరాస్‌పేట్ తదితర ప్రాంతాల నుంచి ఇసుకను రూ.5 నుంచి 6 వేల వరకు విక్రయిస్తూ వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. దీంతో ఇసుకను కొనుగోలు చేయలేక డస్టుతోనే పనులు చేపడుతున్నారు. తాండూరు, కొడంగల్ నియోజకవర్గాల్లోనూ ఇసుక కొరత తీవ్రంగా వేధిస్తోంది. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చి ఎక్కడ ఇళ్ల బిల్లులు ఆగిపోతాయని భావిస్తున్న లబ్ధిదారులు అవసరం మేరకు, అధిక ధరలకు ఇసుక కొనుగోలు చేస్తున్నారు. తాండూరులో ఇసుక రీచ్‌లను గుర్తించారు. అక్కడ ఇసుక పుష్కలంగా ఉన్నా అక్రమంగా ఇసుకను ఇతర పనులకు తరలిస్తున్నారు.

అనుమతులు ఇచ్చినా అదే పరిస్థితి..

నిర్మాణానికి ముగ్గు పోసిన ఇళ్లలో పది శాతం కూడా ఇంకా పునాదుల స్థాయి నిర్మాణం పనులకు నోచుకోలేదు. పరిగి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో రెండు విడతల్లో 2,803 ఇళ్లు మంజూరయ్యాయి. 1,535 మంది లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేయగా, ఇంకా 1,268 మందికి అందాల్సి ఉంది. 1,340 మందికి ఇళ్ల నిర్మాణాలకు మార్కింగ్ ఇచ్చారు. 161 ఇళ్ల నిర్మాణం పనులు బెస్‌మెంట్ స్థాయిలో ఉండగా, 27 ఇళ్ల పనులు పైకప్పు స్థాయిలో, కేవలం ఏడు ఇళ్లు మాత్రం పైకప్పు వరకు చేరుకున్నాయి. మర్పల్లి మండలం, గుండ్ల మర్పల్లి గ్రామాన్ని అధికారులు ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలుకు పైలెట్ గ్రామంగా ఎంపిక చేశారు. ఈ గ్రామంలో సొంత ఇల్లు లేని 9 మందిని నాలుగు నెలల కిందట ఎంపిక చేశారు. కాగా, ఇందులో ఒక్కరు మాత్రమే ఇంటి నిర్మాణం పనులు ప్రారంభించారు. ప్రభుత్వ పరంగా సరఫరా చేసే ఇసుక ఉచితమైనా.. తాండూరు నుంచి ఇసుక తెచ్చుకునేందుకు అనుమతులు, లోడింగ్, ట్రాన్స్‌పోర్టు ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయి. స్లాబ్ వేసేందుకు సదాశివపేటలో బ్లాక్‌లో దొరికే ఇసుక తెచ్చుకోవడమే మార్గంగా కనిపిస్తోంది. ఇదిలా ఉంటే, ఇందిరమ్మ ఇళ్లకు ప్రభుత్వం సరఫరా చేసే ఉచిత ఇసుక కోసం తమను ఎవరూ సంప్రదించలేదని మర్పల్లి హౌసింగ్ అధికారి తెలిపారు.

మేడ్చల్‌లో ముమ్మరంగా నిర్మాణాలు

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు జోరుగా జరుగుతున్నాయి. మొత్తం 1,554 ఇళ్లను మంజూరు కాగా, ఇళ్లు బేస్మెంట్ లెవల్‌కు చేరుకుకున్న 144 మంది లబ్ధిదారులకు రూ. లక్ష చొప్పున, స్లాబ్, రూఫ్ లెవల్ చేరుకున్న 44 మంది లబ్ధిదారులకు రూ.లక్షన్నర మంజూరయ్యాయి. రానున్న శ్రావణ మాసంలో గృహ ప్రవేశాలు నిర్వహించే విధంగా అధికారులు త్వరితగతిన పనులు చేపట్టేవిధంగా లబ్ధిదారులను ప్రోత్సహిస్తున్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో జిల్లాలో ఎటువంటి ఇసుక కొరత లేదు. బౌరంపేటలో ఏర్పాటు చేసిన ఇసుక డంపింగ్‌యార్డు నుంచి ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్న లబ్ధిదారులకు ఇసుకను చేరవేస్తున్నారు. కాగా ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభసమయంలో ఇసుక టన్నుకు రూ.1,300 ఉండగా ఇప్పుడు రూ.2,200లకు చేరుకుంది. ఇసుక ధర పెరుగడంతో లబ్ధిదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రభుత్వం అందించే రూ. 5 లక్షలకు తోడు పెరిగిన ఇసుక ధరకనుగుణంగా డబ్బులు చెల్లిస్తే మేలు జరుగుతుందని లబ్ధిదారులు వాపోతున్నారు.


కులకచర్లలో ఇసుక కొరతతో నిలిచిపోయిన ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులు

ఉచితంగా సరఫరా చేయాలి



పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసిన ప్రభుత్వం ఉచితంగా ఇసుక సరఫరా చేసే విధంగా చర్యలు చేపట్టాలి. స్థానికంగా ఇసుక దొరక్క ఇబ్బందులు తప్పడం లేదు. వర్షాలు లేక వాగుల్లో కూడా ఇసుక లభించడం లేదు. అనుమతులు ఇచ్చినా ఇసుక లోడింగ్, ట్రాన్స్‌పోర్ట్‌కయ్యే ఖర్చు భారీగా అవుతోంది.

\- చంద్రయ్య, లబ్ధిదారుడు, కులకచర్ల

ఇసుక కొరత ఉంది



ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఇసుక కొరత ఉంది. ప్రభుత్వం అనుమతి ఇచ్చినా కొరత మాత్రం కనిపిస్తోంది. లబ్ధిదారులు ఇబ్బందులు పడి ఇసుక తెచ్చుకుంటున్నారు. అయినా కొందరు ఇసుక దొరకడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇసుక సమస్య వల్ల ఇళ్ల నిర్మాణాల్లో కొంత ఆలస్యం జరుగుతోంది.

\- ముకరంబాబా, హౌసింగ్ డిప్యూటీ ఈఈ, పరిగి

ధర అమాంతం పెరిగింది



ఇందిరమ్మ ఇళ్లు మూడు నెలల క్రితం మొదలు పెట్టినప్పుడు ఇసుక ధర టన్నుకు రూ. 1,300లు ఉండగా, ప్రస్తుతం రూ.2,200గా ఉంది. దీంతో ఇసుక కొరత ఏర్పడటంతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ఆలస్యంగా సాగుతోంది. ఇసుకను ప్రభుత్వమే అందజేస్తే బాగుంటుంది. మున్ముందు వర్షాలు కురిస్తే ఇసుక దొరక్క నిర్మాణం మరింత ఆలస్యం అవుతుందని భయమేస్తోంది.

\- వేముల వెంకటమ్మ, ఘట్‌కేసర్ మున్సిపాలిటీ, ఘనాపూర్

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి


మాట్లాడుతున్న వేణుగోపాల్

దుద్యాల, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మహిళలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ ఆకారం వేణుగోపాల్ అన్నారు. మండలంలోని ఈర్లపల్లిలో ఇందిరా మహిళా శక్తి సంబురాల్లో భాగంగా మహిళా సంఘం సభ్యులతో సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మెరుగు వెంకటయ్య, మండల అధ్యక్షుడు ఆవుటి శేఖర్, రవినాయక్, కృష్ణ, మొగులయ్య, సీసీ రాంచంద్రయ్య, సరిత, విజిబాయి, పద్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ దేవతలకు బోనాలు


ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

చౌడాపూర్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చాకల్‌పల్లి గ్రామంలో శనివారం గ్రామ దేవతలకు బోనాలు నిర్వహించారు. గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయంలో గ్రామస్థులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ దేవతలకు మహిళలు బోనాలతో నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పాడి పంటలు బాగాపండాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శేఖర్, గ్రామస్థులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి న్యాయం చేయాలి


బాధిత యువకుడు, కుటుంబసభ్యులతో మాట్లాడుతున్న రమేష్‌కుమార్, మల్లేశం

తాండూరు రూరల్, జూలై 12, (ఆంధ్రజ్యోతి): ఓ సామాజిక వర్గానికి చెందిన వాట్సాప్ స్టేటస్ పెట్టుకున్నాడనే నెపంతో యువకుడిని చితకబాదిన ఘటనపై బాధిత యుకుడిని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు యు.రమేష్‌కుమార్, పట్టణాధ్యక్షుడు నాగారం మల్లేశం పరామర్శించారు. తాండూరు మండలం అంతారం గ్రామానికి శనివారం వెళ్లి బాధిత యువకుడు, కుటుంబంతో మాట్లాడి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా రమేష్‌కుమార్ మాట్లాడుతూ యువకుడిపై మూకుమ్మడి దాడి చేయడం దుర్మార్గమైన చర్య అని ఆగ్రహం వ్యక్తం చేశారు. క్షమాపణలు చెప్పినా దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. దాడి విషయమై పోలీసులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం బాధాకరమన్నారు. వారివెంట బీజేపీ నాయకులు వడ్డె సాయిలు, రమేష్, నాయకులు వడ్డె సాయిలు, రమేష్ యువకులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

దోమ, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొంపల్లికి చెందిన రాగుల శివమ్మ(53) శనివారం అనారోగ్యంతో మృతిచెందింది. విషయం తెలుసుకున్న బీజేపీ గ్రామ అధ్యక్షుడు ముద్ద మల్లేశ్ యాదవ్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.4వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. పేద కుటుంబాలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు నరేశ్, నర్సింహాయాదవ్, మల్లేశ్ యాదవ్, శ్రీనివాస్‌యాదవ్, నర్సింహులు యాదవ్, బాల్‌రాజ్, చిన్నయ్య, వెంకటేశ్, పవన్, శివ, బాబు, వెంకట్‌యాదవ్ పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం


బొంరాస్‌పేట్: చెక్కును అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కులకచర్ల, జూలై 12 (ఆంధ్రజ్యోతి): సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం లాంటిదని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు, మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్.ఆంజనేయులు అన్నారు. మండలంలోని రాంరెడ్డిపల్లి గ్రామానికి చెందిన అంబాబాయికి శనివారం రూ.40వేలు, స్వాతికి రూ.58వేలు చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి, అడ్వకేట్ కోస్గి నర్సింహులు యాదవ్, గ్రామ కమిటీ అధ్యక్షుడు అనుమోని నర్సింహులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పూడూరు: పూడూరు మండలం మన్నెగూడలో శనివారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సురేందర్, పీఏసీఎస్ చైర్మన్ సతీష్‌రెడ్డి లబ్ధిదారులకు ఈ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, పెంటయ్య, వీరేష్, ఆరీఫ్, అజీమ్ పటేల్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

బొంరాస్‌పేట్: మండలంలోని తుంకిమెట్ల గ్రామానికి చెందిన చాకలి సాయమ్మ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందింది. ప్రభుత్వం ద్వారా మంజూరైన రూ.లక్ష సీఎంఆర్ఎఫ్ చెక్కును మృతురాలి భర్త చాకలి కొండయ్యకు కాంగ్రెస్ నాయకులు రాంచంద్రారెడ్డి, మల్లికార్జున్, బాల్‌రాజ్ గౌడ్ అందజేశారు.

యువత సేవాభావం అలవర్చుకోవాలి


సమ్మేళనంలో ప్రసంగిస్తున్న స్వామి బోధ మయానంద మహారాజ్

తాండూరు, జూలై 12(ఆంధ్రజ్యోతి): యువత సేవాభావం అలవర్చుకోవాలని హైదరాబాద్ రామకృష్ణమఠం అధ్యక్షుడు స్వామిబోధ మయానంద మహారాజ్ అన్నారు. తాండూరులోని తులసిగార్డెన్‌లో శనివారం నిర్వహించిన రామకృష్ణ వివేకానంద భావ ప్రచార పరిషత్ తెలంగాణ అర్ధవార్షిక సమ్మేళనంలో మాట్లాడారు.. సేవా సమితులు వ్యవస్థ నిర్వహణను అక్రమంగా నిర్వహించాలని మరింత అంకిత భావంతో పనిచేయాలని కోరారు. సేవా సమితి ద్వారా ఎందరో జీవితాలలో వెలుగులు నింపుతున్నారని తెలిపారు. రామకృష్ణ మఠం ద్వారా కలెక్టర్లు అయ్యారని, పద్మశ్రీ అవార్డులు పొందారని గుర్తు చేశారు. యువకులలో ఆధ్యాత్మిక భావన పెంపొందించి మానసిక ఒత్తిడిని దూరం అయ్యేలా చూడాలని ఏకాగ్రత వైపు మళ్లించాలని అన్నారు. వేదానంద మహారాజ్ మాట్లాడుతూ 50 సంవత్సరాలలోపు వారు భక్తులుగా మారడం అవసరమని అన్నారు. ఈ కార్యక్రమంలో బాలల మాసపత్రిక అయిన మొలక జూలై మాసం సంచికను స్వామిజీలు ఆవిష్కరించారు. సమితి ప్రతినిధులు సూర్యప్రకాష్, బాలకృష్ణ, మోహన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, గాజుల బస్వరాజ్, కేవీఎం వెంకట్ పాల్గొన్నారు.

బీసీలకు రిజర్వేషన్ కల్పించడం హర్షణీయం


రుద్రారంలో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న బీసీ సంఘం నాయకులు

దుద్యాల/చౌడాపూర్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): బీసీలకు స్థానిక సంస్థల్లో, విద్యా, ఉద్యోగాల్లో 42శాతం రిజర్వేషన్ కల్పించడం హర్షణీయమని బీసీ విద్యార్థి విభాగం రాష్ట్ర కార్య నిర్వాహక అధ్యక్షుడు శివకుమార్ అన్నారు. ఆయన శనివారం మాట్లాడుతూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని కేబినెట్ నిర్ణయం తీసుకొని, ఆర్డినెన్స్‌ను తెచ్చి గవర్నర్ ద్వారా ఆమోదించేందుకు తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకం అన్నారు. బీసీ రిజర్వేషన్ నిర్ణయం పట్ల చౌడాపూర్ మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. రిజర్వేషన్‌కు ఆమోదం హర్షించదగ్గ విషయమన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అశోక్‌కుమార్, రామ్మోహన్ శర్మ, గోపాల్‌నాయక్, రామ్, వెంకటయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కొడంగల్ రూరల్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం పట్ల హర్షంవ్యక్తం చేస్తూ సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. మండలంలోని రుద్రారంలో బీసీ నాయకులు అంబయ్యగౌడ్, సాయిలు, సంజీవ్, వెంకటయ్యగౌడ్, నర్సింహులు తదితరులు పాలాభిషేకం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌కు కట్టుబడి ఈ నిర్ణయం తీసుకోవడం హర్షించదగ్గ విషయం అన్నారు.

కాంగ్రెస్‌తోనే పేదల సొంతింటి కల సాకారం

కులకచర్ల, జూలై 12 (ఆంధ్రజ్యోతి): పేదల సొంతింటి కల కాంగ్రెస్‌తోనే సాకారం అవుతుందని డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి అన్నారు. మండలంలోని పుట్టపహాడ్ గ్రామంలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలను శనివారం మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్.ఆంజనేయులుతో కలిసి పరిశీలించారు. అర్హులైన వారందరికీ ప్రభుత్వం ఇళ్లను మంజూరు చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి గోపాల్‌నాయక్, మాజీ మండల అధ్యక్షుడు వెంకటయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పోరాట యోధుల జీవితం స్ఫూర్తిదాయకం


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న చిత్ర బృందం

వికారాబాద్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): పోరాట యోధుల జీవితం స్ఫూర్తిదాయకమని దర్శకుడు సేనాపతి అన్నారు. వికారాబాద్ జిల్లా కేంద్రంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమరయ్య జీవిత చరిత్రను ఆధారంగా చేసుకొని రూపొందిస్తున్న చలనచిత్రానికి సంబంధించిన పోస్టర్‌ను శనివారం నిర్మాణ కమిటీ చైర్మన్ బొంరాస్‌పేట మాజీ జడ్పీటీసీ దేశ్యానాయక్, గిరిజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు రాథోడ్ శ్రీనివాస్ నేతృత్వంలో పోస్టర్‌ను అమరుల స్థూపం వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సినిమా రంగంలో అట్టడుగువర్గాలకు చెందిన యోధుల గాథలు వెండితెరపై ప్రదర్శించడమే తన లక్ష్యమన్నారు. అదేవిధంగా ప్రతీ జిల్లా నుంచి 26మంది సహ నిర్మాతలుగా ఈ సినిమాలో భాగస్వామ్యం కావడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. కమిటీ సభ్యులు అహర్నిశలు శ్రమిస్తూ, కొమరయ్య జీవితాన్ని సమగ్రంగా ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నిర్మాత తార్యా పవార్, దేశ నాయక్, నర్సింహానాయక్, రవి నాయక్, బలరాంనాయక్, తిరుపతి, రత్నయ్య, చింటు పవర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గ్రామ కమిటీ ఎన్నిక

చౌడాపూర్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కిష్టంపల్లిలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎల్పాటి అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో శనివారం నూతన గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఆంజనేయులు, మాధవులు, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా దశరథ్‌ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్‌చైర్మన్ నాగరాజు, ఏఎంసీ వైస్‌చైర్మన్ రామ్మోహన్‌శర్మ, కాంగ్రెస్ నాయకులు అమర్‌నాథ్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, నర్సింహానాయక్, దామోదర్‌రెడ్డి, వెంకటయ్యగౌడ్, చెన్నయ్య, గోపాల్‌నాయక్, రాము, మన్యం, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

కులకచర్ల: గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్.అంజనేయులు అన్నారు. మండలంలోని పలు గ్రామాల కాంగ్రెస్ కమిటీలను శనివారం ఎన్నుకున్నారు. అంతారం గ్రామ కమిటీ అధ్యక్షుడిగా కావలి తిరుపతయ్య, పెద్ద అంతారం గ్రామ అధ్యక్షుడిగా విష్ణువర్ధన్ రెడ్డి ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి, కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి గోపాల్‌నాయక్, మాజీ ఎంపీపీ అంజిలయ్యగౌడ్, మాజీ మండల అధ్యక్షుడు వెంకటయ్యగౌడ్, మాజీ ఎంపీటీసీ ఆనంద్ పాల్గొన్నారు.

బీజేపీ సీనియర్ నాయకుడు వైద్యనాథం మృతి

ధారూరు, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంపల్లికి చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు, కరసేవకుడు వైద్యనాథం అనారోగ్యంతో శుక్రవారం రాత్రి మృతి చెందారు. చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి శనివారం వైద్యనాథంకు నివాళులర్పించి కుటుంబసభ్యులను పరామర్శించి అంత్యక్రియలలో పాల్గొన్నారు. ఆయన వెంట బీజేపీ నాయకులు కరుణం ప్రహ్లాద్ రావు, వి.నందు, మాధవ రెడ్డి, శివరాజ్, శ్రీధర్ రెడ్డి, నరోత్తంరెడ్డి, నరేందర్‌రెడ్డి, పాండుగౌడ్, రాజునాయక్ తదితరులు ఉన్నారు.


వైద్యనాథం అంత్యక్రియల్లో ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుతాం


సమావేశ నిర్వహణకు కన్వెన్షన్ హాల్‌ను పరిశీలిస్తున్న నాయకులు

ఘట్‌కేసర్ రూరల్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుతామని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కొమ్మిడి శోభదామోదర్‌రెడ్డి తెలిపారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ అవుశాపూర్ పీపీఆర్ కన్వెన్షన్‌లో ఈనెల 15న జరిగే స్థానిక సంస్థల ఎన్నికల రాష్ట్ర కార్యవర్గ సమావేశం పనులను ఆమె శనివారం నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మాజీ మండల అధ్యక్షుడు చలువాది ప్రవీన్‌రావు పాల్గొన్నారు.

నవాబ్‌అలీ జయంతిని విస్మరించిన ప్రభుత్వం


మాట్లాడుతున్న మొహమ్మద్ వసీమ్

కొడంగల్ రూరల్/బొంరాస్‌పేట్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించడంలో ముఖ్యభూమిక పోషించిన ప్రముఖ ఇంజనీర్ నవాబ్‌అలీ నవాబ్‌జంగ్ బహదూర్ జయంతిని ప్రభుత్వం విస్మరించిందని తెలంగాణ మైనార్టీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మొహమ్మద్ వసీమ్ ఆరోపించారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ.. నిజాం పాలనలో చీఫ్‌ఇంజనీర్‌గా ఉన్న నవాబ్‌అలీ నవాజ్‌జంగ్ బహద్దూర్ నిర్మించిన ప్రాజెక్టులు, భవనాలతో పాటు తెలంగాణకే తలమాణికమైన నిజాంసాగర్, పోచారం, వైరా,దిండి, పాలేరు, ఎగువ మానేరు, హిమాయత్‌సాగర్, ఉస్మాన్ సాగర్, నాగార్జునసాగర్ తదితర కట్టడాలే నిదర్శనమన్నారు. అలాంటి ఆయన జయంతిని ప్రభుత్వం నిర్వహించకపోవడం ముస్లిం మైనార్టీలను బాధకు గురిచేసిందన్నారు. ఎన్నికల ముందు మైనార్టీల ఓట్లు దండుకోవడానికి మైనార్టీ డిక్లరేషన్ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం హక్కుల విషయానికి వచ్చాక పక్కకు పెట్టేస్తోందన్నారు. ఒక్క శాసనసభ, ఎమ్మెల్సీ స్థానం ఇవ్వకపోవడంతో పాటు మంత్రివర్గంలోనూ మైనార్టీలకు స్థానం కల్పించలేదన్నారు. గత ప్రభుత్వ హయాంలో నిర్వహించిన మహనీయుల జయంతులను కూడా అధికారంలో ఉన్న ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.

ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు


ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న యువకులు

కొడంగల్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): సిద్దనొంపు ఆంజనేయస్వామి ఆలయంలో హిందూ వాహిని సభ్యులు, యువకులు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. 94వ వారం పూర్తయిన సందర్భంగా సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. ఆలయంలో స్వామివారికి అభిషేకం, పూజలు చేశారు.

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన యూత్ కాంగ్రెస్ నాయకులు


సీఎం రేవంత్‌రెడ్డితో యూత్ కాంగ్రెస్ నాయకులు

కొడంగల్/దౌల్తాబాద్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డిని కొడంగల్, దౌల్తాబాద్, బొంరాస్‌పేట్ మండలాల యూత్ కాంగ్రెస్ నాయకులు కలిశారు. హైదరాబాద్‌లో శనివారం సీఎం నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. కొడంగల్ నియోజకవర్గ అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించినట్లు వారు తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సీఎం సూచించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్డి శ్రీనివాస్, రాజ్‌గోపాల్, చరణ్, కృష్ణంరాజు, నరేశ్‌యాదవ్, మహిపాల్, విజయ్, వెంకటేశం, రాజగోపాల్, చరణ్, అమర్‌నాథ్, మహిపాల్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.